శ్రమదానం.. స్వచ్ఛతే లక్ష్యం


రామళ్లకోటలో శ్రమదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గుడేకల్‌లో స్వచ్ఛత కార్యక్రమంలో ఎంపీడీఓ బంగారమ్మ


పోతుగల్లు చెరువులో శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు


నందవరంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: భారత ప్రభుత్వం ఈ నెల 15 నుంచి చేపట్టిన 'స్వచ్ఛతే సేవా' కార్యక్రమంలో భాగంగా హొళగుంద మండలంలో ఆదివారం సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీలు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ చలువాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పంపాపతి తదితరులు బస్టాండుతో పాటు పాత పోలీస్ స్టేషన్ పరిసరాల్లో చీపురు పట్టి చెత్త చెదారాన్ని తొలగించారు.
దేవనకొండ: తెర్నెకల్ గ్రామ పంచాయతీలో సర్పంచ్, కర్నూలు జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు మొగతాల్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆదివారం ఒక గంటపాటు తేరుబజారులోని ముత్తుకూరు గౌడప్ప విగ్రహం నుంచి వడ్డే గేరి వరకు శ్రమదానం చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లుముంబా, ఈరన్న, శ్రీను, రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శులు తలారి రాముడు, సునీత, సచివాలయ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.
తుగ్గలి: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, చిగుర్లగుట్టతండా సర్పంచ్ బనావత్ లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణనాయక్ అన్నారు. జీ.ఎర్రగుడిలో స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల సమీపంలో చీపుర్లతో చెత్త చెదారం ఊడ్చి కంప చెట్లు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామాంజనేయులు, స్వచ్ఛ భారత్ కార్మికులు పాల్గొన్నారు.
హాలహర్వి: మండలంలోని చింతకుంట, నిట్రవట్టి, బల్లూరు, హాలహర్వి తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ లింగప్ప, ఎంపీపీ నెట్టికంఠమ్మ, సర్పంచులు సద్దాంహుసేన్, గాదిలింగ, ఎంపీటీసీ గోపాల్, గాదిలింగ, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది చీపురు చేతపట్టి రోడ్లను శుభ్రం చేశారు. డ్రెయినేజీ కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం, పూడిక తొలగించారు.
మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి తదితరుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ సర్పంచ్ ప్రమీలమ్మ పాల్గొన్నారు.
గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ఆదివారం సర్పంచులు, అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ హైమవతి, అధికారులు శ్రమదానం చేశారు. చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దేవాలయం నుంచి బస్టాండ్ వరకు పరిసరాలను శుభ్రం చేశారు.
నందవరం: పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జె.శివారెడ్డిగౌడ్, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఆదివారం స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. నందవరంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి సొసైటీ కార్యాలయం వరకు చీపురు పట్టి క్లీన్ చేశారు. అలాగే మండలంలోని నాగలదిన్నె, నదికై రవాడి, ఇబ్రహీంపురం, గురజాల, ముగతి తదితర గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఆయా గ్రామాల సర్పంచులు తోట సావిత్రి, లక్ష్మీ, వీరస్వామి, ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, స్థానిక నేతలతో కలసి రోడ్లు, ప్రధాన కూడళ్లతో పాటు వీధుల్లో చెత్త చెదారం తొలగించారు. ఎంపీటీసీలు సుంకన్న, భీమలింగ తదితరులు పాల్గొన్నారు.
ఆలూరు: మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అరుణాదేవి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి హరిత రాయబారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. పారిశుద్ధ్య చర్యలపై ప్రజలకు, హోటళ్ల యజమానులు, కిరాణం షాపుల వారికి అవగాహన కల్పించారు. అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.
ఎమ్మిగనూరురూరల్: మండలంలోని గుడేకల్ గ్రామంలో ఎంపీడీఓ బంగారమ్మ, ఈవోఆర్డీ విజయలక్ష్మీ స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేయించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, పేపర్లను ఎక్కడబడితే అక్కడ వేయరాదని ప్రజలకు సూచించారు. సర్పంచ్ మాల నరసమ్మ, ఎంపీటీసీ ఆనందరాజు, వార్డు మెంబర్ దాసప్ప తదితరులు పాల్గొన్నారు.
కృష్ణగిరి: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రతిఒక్కరు ఆరోగ్యం ఉంటారని వాటర్‌షెడ్ జేఈ అయూబ్ అన్నారు. మండల పరిధిలోని పోతుగల్లు గ్రామ సమీపంలోని చెరువులో వాటర్‌షెడ్ కింద చేపట్టిన ఊటకుంట వద్ద ఆదివారం ఆయన కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేశారు. ఊటకుంట సమీపంలో ముళ్ల కంపలను తొలగించారు. గ్రామ వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ మహదేవమ్మ, సెక్రటరీ వెంకటేశ్వర్లు, సభ్యులు జయన్న, రాముడు, లింగారెడ్డి, సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.
వెల్దుర్తి: రామళ్లకోట గ్రామంలో పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రమదానం చేశారు. సర్పంచ్ నిర్మల, సెక్రటరీ వెంకటేశ్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవస్వామి, డీలర్ శేషన్న, బీటీ నాయుడు, ఆధ్వర్యంలో బస్టాండులోని బస్‌షెల్టర్ ముందు చెత్త చెదారాన్ని తొలగించారు. వెల్దుర్తి పాతబస్టాండులో జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, గోవర్ధనగిరిలో సర్పంచ్ ఎల్లరాముడు తదితరులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.


తెర్నెకల్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న సర్పంచ్ అరుణ్‌కుమార్ తదితరులు


హొళగుందలో శుభ్రం చేస్తున్న సర్పంచ్ తదితరులు


జీ.ఎర్రగుడిలో ముళ్లకంప తొలగిస్తున్న సర్పంచ్, నాయకులు


గోనెగండ్లలో వీధిని శుభ్రం చేస్తున్న దృశ్యం


ఆస్పరిలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ రాధమ్మ

క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, మహా మంగళారతి, పూల సేవ, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూజారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామిని దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


తుగ్గలిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

తుగ్గలి: ఆటో వాలాలకు అన్నగా.. కార్మికులకు కొండంత అండగా.. తానున్నానే భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత ఆర్థిక సాయం అందించిన నేపథ్యంలో ఆదివారం తుగ్గలిలో ఆటో డ్రైవర్లు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సీఎం అందించిన సాయాన్ని ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణువర్ధనరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మద్దికెర: స్థానిక నాయకుల సహకారంతో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన మండల కన్వీనర్ గంపల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మద్దికెర కమ్యూనిటీ హాలులో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కన్వీనర్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సహకరించాలని కోరారు. ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు డైరెక్టర్ భద్రయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆలూరు–గుంతకల్లు ప్రధాన రహదారి నుంచి 1.50 కి.మీ మేర రామదుర్గం గ్రామం వరకు దెబ్బతిన్న పాత రోడ్డు తొలగింపు పనులు చేపట్టారు. గత నెలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తెచ్చారు. ఆయన ఆదేశాలతో నిధులు మంజూరుకాగా వెంటనే పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లార్తి దర్గాలకు విరాళం

హొళగుంద: ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అనంతపురం జిల్లాకు చెందిన భక్తుడు 6 వీల్ చైర్లు, 2 కూల్ వాటర్ ట్యాంకులను విరాళంగా ఇచ్చారు. అనంతపురం పట్టణం హమాలీ కాలనీకి చెందిన ఎస్.సద్దాంబాషా (సీఆర్‌డీఎస్) అనే భక్తుడు దర్గాకు వాటిని విరాళంగా అందజేసినట్లు దర్గా ఈఓ, వక్ఫ్‌బోర్డు అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. దివ్యాంగ, వృద్ధ భక్తులకు వీల్ చైర్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అలాగే శేక్షావలి, షాషవలి దర్గాలో కూల్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రిప్ విధానంతో సాగునీరు ఆదా

ఆలూరు: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి డ్రిప్ విధానంలో తక్కువ నీటితో పంటల సాగు చేపట్టవచ్చని హార్టికల్చర్ అధికారిణి ఇందిర అన్నారు. దేవనకొండ మండలం అలారుదిన్నె, మాచాపురం, ఆలూరు, విరుపాపురం తదితర గ్రామాల్లో ప్రభుత్వం నుంచి డ్రిప్ పరికరాలు పొందిన రైతుల పొలాలను ఆదివారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తీగ పంటలు, ఆకుకూరలు, కూరగాయలు సాగుకు డ్రిప్ విధానం అనువైందన్నారు. ఆలూరు నియోజకవర్గంలో దాదాపు 5 వేల ఎకరాల్లో డ్రిప్ పద్ధతిలో పంటలు సాగుకు సహకారం అందించినట్లు తెలిపారు.

ఉత్సవాలు విజయవంతం

కృష్ణగిరి: పుట్లూరు గ్రామంలో వెలసిన మాతా మారెమ్మ బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు కాంతారెడ్డి, రాముడు, పుల్లారెడ్డి, పుల్లన్న తదితరులు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన కృష్ణగిరి, వెల్దుర్తి ఎస్‌ఐలు సురేష్, చంద్రశేఖర్‌రెడ్డిలను ఆదివారం శాలువాలతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు.

3 నుంచి ఫార్మేటివ్-2 పరీక్షలు

తుగ్గలి: మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు ఫార్మేటివ్-2 పరీక్షలు నిర్వహించాలని ఎంఈఓ-2 రామవెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను పరీక్షలు జరిగే తేదీల్లో జిల్లా విద్యాశాఖాధికారి వాట్సాప్ గ్రూప్‌నకు షేర్ చేస్తారని తెలిపారు. వాటిని ఎంఈఓలు వాట్సాప్ గ్రూపుల ద్వారా పాఠశాలల హెచ్‌ఎంలకు పరీక్షలకు గంట ముందు సాఫ్ట్ కాపీలను పంపుతారని వివరించారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి విద్యార్థుల మార్కులను సీఎస్ఈ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

4 నుంచి దశమి ఉత్సవాలు

గోనెగండ్ల: మండలంలో వెలసిన భక్తుల పాలిట కొంగు బంగారంగా పేరొందిన ఆది చింతలాముని రంగడు, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 4న బుధవారం రాత్రి 2 గంటలకు స్వామివారి పల్లకి సేవతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. 5న దశమి మహోత్సవం, 6న సాంస్కృతిక కార్యక్రమాలు, 7న పారువేట ఉత్సవం, 8న స్వాముల వారి ఆరాధనతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు రాష్ట్రంతో పాటుతెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి విత్తన పంపిణీ


విత్తన నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న పప్పుశనగ విత్తనాలను సోమవారం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఏఓ రవి ఆదివారం తెలిపారు. విత్తనాల కోసం నమోదు చేసుకున్న వారికి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయాధికారులు అందజేస్తారన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 5 ఎకరాలకు 6 విత్తన ప్యాకెట్లు అందిస్తామన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి 5688 రైతులకు చెందిన 19180 ఎకరాలను ఈ–క్రాప్ నమోదు (వంద శాతం) పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ-కేవైసీ 42 శాతం పూర్తయిందని 8380 ఎకరాలకు సంబంధించి 2507 మంది రైతులు నమోదు చేయించుకున్నారన్నారు. రైతులు త్వరగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. వీఏఏలు జాకీర్, రాణి, ఆనంద్ ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం కోసం వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎల్‌ఐసీ ఏజెంట్ల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని స్థానిక లియాఫి (ఏజెంట్ల సంఘం) బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు ఎల్‌ఐసీ బ్రాంచ్ పరిధిలోని ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం, గోనెగండ్ల, కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, మద్దికెర తదితర మండలాల నుంచి వెయ్యి మందికి పైగా ఎల్‌ఐసీ ఏజెంట్లు బ్రాంచ్‌కు ఎల్‌ఐసీ కార్యకలాపాలపై వస్తుంటారని తెలిపారు. వారికి కనీస సదుపాయాలు అందుబాటులో లేనందున ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సౌకర్యార్థం పట్టణంలో కమ్యునిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. లియాఫి ఆర్థిక కార్యదర్శి శివరాముడు, జోనల్ డివిజన్ నాయకుడు ఆంధ్రయ్య, రమేష్, రంగస్వామి, హరినాథ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న డీటీ రఘువీర

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ రఘువీర కోరారు. ఆదివారం రాయచోటి గ్రామంలో సమగ్ర సర్వేపై రెవెన్యూ అధికారులు రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా భూములను సర్వే చేయించి, హద్దులు ఏర్పాటు చేస్తుందన్నారు. సమగ్ర సర్వేతో భూ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. 2వ తేదీ (సోమవారం) నుంచి గ్రామంలో సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులు అందుబాటులో ఉండి సర్వేకు సహకారించాలని కోరారు. అలాగే రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే చేపట్టాలని సర్వేయర్లకు సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తామని చెప్పారు. మండల సర్వేయర్ అక్బర్‌బాషా, సర్వేయర్లు ముగతి శేఖర్, మల్లికార్జున గౌడ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన నరేష్‌ను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. మంత్రాలయం మండలం చెట్నేహళ్లి గ్రామానికి చెందిన నరేష్, సురేష్ బైక్‌పై నాగలదిన్నెకు బయలుదేరారు. జొహరాపురం గ్రామం దాటిన తరువాత దేవుడి మాన్యం వద్ద చెట్టుపై తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు గాలికి వీరి బైక్‌కు అడ్డం పడ్డాయి. నరేష్ బైక్ నడుపుతుండగా గొంతుకు విద్యుత్ వైరు అడ్డం పడడంతో అదుపుతప్పి కింద పడ్డారు. నరేష్‌కు గొంతు కింద, ఎడమ చేతికి, నడుముకు గాయాలయ్యాయి. బైక్‌పై వెనుక కుర్చున సురేష్‌కు తల వెనుక భాగంలో స్వల్ప గాయమైంది. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయమే విద్యుత్ వైర్లు తెగి చెట్టు మీద పడ్డాయి. రైతులు గమనించి విద్యుత్ కనెక్షన్ తొలగింపజేశారు. దీంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రేపు ఎమ్మెల్యే రాక

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామానికి మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: భవన నిర్మాణ కార్మికులకు ఈ–శ్రమ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘం పట్టణ నాయకుడు ఉస్మాన్ అలీ, సీఐటీయూ నాయకుడు రాముడు కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పథకాలు అందజేసి ఆదుకోవాలన్నారు. నాయకులు అలిబాష, తిమ్మప్ప పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి


చెంచాల ఉమాపతి (ఫైల్)

పత్తికొండ రూరల్: పని నిమిత్తం ఆదోనికి వెళ్లి ఆటో ఢీకొన్న ప్రమాదంలో పత్తికొండ మాజీ వార్డు సభ్యుడు చెంచాల ఉమాపతి (65) ఆదివారం మృతి చెందాడు. ఆయన హిందూ, ముస్లింల ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరికీ సుపరిచితుడుగా ఉండేవారు. శుక్రవారం ఆదోనిలో రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సుశీలమ్మ, కుమారుడు ఠాగూర్, కుమార్తెలు రూపావాణి, కల్యాణి ఉన్నారు.

యువకుడి మృతి


నాగేంద్ర (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి చికిత్స పొందుతూ శెట్టిబలిజ నాగేంద్ర (26) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాలు.. మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామానికి చెందిన నాగేంద్రకు భార్య సుజాత, కుమార్తె రేవతి, కుమారుడు శేఖర్ ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రెండేళ్ల నుంచి మద్యానికి బానిస అయ్యాడు. మద్యం తాగడానికి, సంసారానికి అప్పులు పుట్టుక సెప్టెంబర్ 29వ తేదీన పురుగు మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఏఎస్‌ఐ బాలజీనాయక్ తెలిపారు.

పింఛన్ల పండుగ


రాంపల్లిలో ఏకాశి ఈరమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సురేష్


కర్నూలు ఆస్పత్రిలో మునెమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ లక్ష్మన్న


నిట్రవట్టిలో నడవలేని స్థితిలో ఉన్న గంగమ్మవ్వ పింఛన్ అందిస్తున్న వలంటీర్ బసవరాజు


టి.గోకులపాడులో వృద్ధురాలు లక్ష్మీదేవికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ ప్రదీప్‌రెడ్డి

తుగ్గలి: మండలంలో వైఎస్సార్ పింఛను కానుక కింద నగదు పంపిణీ ఆదివారం ఉదయాన్నే ప్రారంభమైంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వేలిముద్రలు సేకరించి పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలో 7807 మంది లబ్ధిదారులకు రూ.2,16,05,250 మంజూరైంది. తొలిరోజు సాయంత్రం 6 గంటల వరకు 65 శాతం మందికి పింఛన్ పంపిణీ చేశారు. ఇంటి వద్దకే పింఛన్ అందించే కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చల్లగా ఉండాలంటూ లబ్ధిదారులు దీవిస్తున్నారు. 5వ తేదీ వరకు పింఛన్ పంపిణీ కొనసాగుతుందని, వంద శాతం పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు.
ఆస్పరి: మండలంలోని 33 గ్రామాల్లో తొలిరోజు 80 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్ల ఎంపీడీఓ రాణెమ్మ ఆదివారం తెలిపారు. మొత్తం 7,332 పింఛన్ దారులకు గాను 5,865 మందికి పంపిణీ పూర్తి చేశామన్నారు. మిగతా వారికి త్వరలో అందజేసి వంద శాతం పూర్తి చేస్తామని ఎంపీడీఓ చెప్పారు. ముత్తుకూరు గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ తోయజాక్షప్ప పంపిణీ చేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్

గోనెగండ్ల: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఖాఖీ మునెమ్మ 20 రోజుల క్రితం ఇంటి వద్ద కిందపడంతో కాలు విరిగి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ లక్ష్మన్న ఆదివారం కర్నూలులోని ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి వృద్ధాప్య పింఛన్ రూ.2,750 అందజేశాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్లే కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ అమ్మకు పింఛన్ అందిందని, ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని ఆమె కుమారులు రంగన్న, వెంకటేష్ తెలిపారు. ఈ సొమ్ము వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందన్నారు.
కృష్ణగిరి: అక్టోబర్ నెలకు సంబంధించి మండలంలో మొదటిరోజు రాత్రి 7 గంటలకల్లా 70 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు.
హొళగుంద: మండలంలో మొత్తం 6,142 పింఛన్‌లు ఉండగా ఆదివారం 3,909 మందికి పంపిణీ (64 శాతం) చేసినట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ తెలిపారు.
హాలహర్వి: మండలంలో ఆదివారం ఒక్కరోజే 70 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి అయ్యిందని ఎంపీడీఓ ఆంతోనీ తెలిపారు. మరో రెండు రోజుల్లో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు.

వన్య మృగాలను వేటాడితే చర్యలు

ఆలూరు: అటవీ ప్రాంతాల్లోని వన్య మృగాలను వేటాడి చంపితే కేసులు నమోదు చేస్తామని ఆలూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం దేవగరట్టు ఫారెస్ట్ బీట్‌లో వివిధ రకాల మొక్కలు నాటేందుకు తవ్వించిన గుంతలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అడవుల సంరక్షణలో భాగంగా దేవరగట్టు, గూళ్యం, హొళగుంద ఫారెస్ట్ బీట్లలో వివిధ రకాల మొక్కలు నాటిస్తున్నట్లు తెలిపారు. 10 వేల నుంచి 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు.

చౌడేశ్వరి జ్యోతి మహోత్సవాలకు వేళాయె


పూజలందుకుంటున్న చౌడేశ్వరి అమ్మవారు

పత్తికొండ రూరల్: పట్టణంలోని రెడ్డిబావి వీధిలో కొలువైన చౌడేశ్వరీ మాత భక్తుల పాలిట ఆరాధ్యదైవంగా విరాజిల్లుతుంది. వీధిలో 1862లో తవ్వకాలు జరుపుతుండగా లభ్యమైన బచ్చన చౌడమ్మ విగ్రహానికి 161 ఏళ్లుగా పూజలందుకున్న చౌడమ్మ ప్రతిమ రూపంలో 39 ఏళ్ల కిందట భక్తులు విగ్రహ ప్రతిష్ట గావించారు. కొలిచిన వారికి కొంగుబంగారంగా చౌడేశ్వరీమాత భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటోం. తొగట వీరక్షత్రియుల కులదైవమైన చౌడేశ్వరి దేవి తమను ఎప్పుడూ చల్లంగా చూస్తుందని భక్తుల విశ్వాసం. ఏటా మహాలయ పౌర్ణిమ రోజున చౌడేశ్వరీ దేవికి రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తారు. భాద్రపద మాస పౌర్ణిమ తరువాత వచ్చే మంగళవారం తెల్లవారుజామున అమ్మవారి జ్యోతుల మహోత్సవం రోజునే ఇక్కడి ప్రాంత వాసులంతా మహాలయ పౌర్ణిమను జరుపుకోవడం ఆనవాయితీ.

పల్లకీ అమ్మవారి ప్రత్యేకత

ఇక్కడి పల్లకీ అమ్మవారికి ఓ విశిష్టత ఉంది. ఎవరైనా ఆలయానికి వచ్చి మనసులో అనుకున్న కోరిక నెరవేరితే అందుకు సంబంధించిన మొక్కుబడిని తీర్చుకునేందుకు అమ్మవారే వారి ఇంటికి వెళ్లడం విశేషం. వారు ఏది చెల్లిస్తామని మనసులో అనుకుంటే దాన్ని చెల్లించేంత వరకు అక్కడి నుంచి ముందుకు వెళ్లరని భక్తుల ప్రగాఢమైన నమ్మకం. ఇదే తరహాలో ఏటా అమ్మవారు పల్లకీలో భక్తుల ఇంటికి వెళ్లగా వివిధ కానుకలు మొక్కుబడులను చెల్లించుకుంటారు.

చౌడేశ్వరీ దేవి పూజల వివరాలు

ఆలయంలో 2వ తేదీన ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, అర్చన, పూజాకార్యక్రమములు మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం. సాయంత్రం 5 గంటలకు పూజా కార్యక్రమం, రాత్రి 7 గంటలకు గణం, గంగపూజ, 8 గంటలకు మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ. 3న తెల్లవారుజామున 3 గంటల నుంచి 8.30 గంటల వరకు జ్యోతుల మహోత్సవం సందర్భంగా అమ్మవారి పల్లకీఊరేగింపు ఉంటుంది. తరువాత ప్రత్యేక పూజలు మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జ్యోతుల మహోత్సవం కార్యక్రమం సాగుతుందిలా

3వ తేదీన తెల్లవారుజామున 3 గంటల నుంచి 8.30 గంటల వరకు తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరీ దేవి జ్యోతుల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట బయలుదేరిన జ్యోతులు పోలీసు స్టేషన్ మీదుగా ఆలయానికి చేరుకుంటాయి. జ్యోతుల మహోత్సవానికి అనంతపురం జిల్లా తాడిపత్రి, యాడికి, చిన్నపడమల, కర్నూలు జిల్లా వెలుగోడు, ఆత్మకూరు ప్రాంతాల నుంచి వందలాది భజన బృందాలు పాల్గొంటాయి. ఉత్సవాల సందర్భంగా గుంతకల్లు, ఆదోని, గుత్తి, కర్నూలు, డోన్ తదితర పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు రెండు రోజులు ముందుగానే పత్తికొండకు చేరుకున్నారు.